manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 166 | మంగళవారం | 26.11.2024



## మానుకోట నుంచే
# పోరాటం

- రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం..
- మహిళలను మోసం చేస్తున్న సీఎం
- మానుకోట మహాధర్నాలో కేటీఆర్

**మన చౌరాస్తా, మహబూబాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ ఉద్యమంలో మానుకోటకు ప్రత్యేక స్థానం ఉందని.. 14 ఏళ్ల కిందట కీలక మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. లగచర్ల బాధిత రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ మహాధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంత రేవంత్‌కు బుద్ధి చెప్పేందుకు అదే మానుకోట సిద్ధమైందని అన్నారు. 'కొడంగల్‌లో 9 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు తిరగబడ్డారు. 3 వేల ఎకరాలను గుంజుకోవాలని సీఎం ప్రయత్నిస్తున్నారు. తమ భూములు లాక్కోవద్దని కొడంగల్ రైతులు కోరుతున్నా.. అక్కడి వారి బాధలు వినే తీరిక, ఓపిక సీఎంకు లేదు. ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి 28 సార్లు ఢిల్లీకి పోయిండు. కనీసం రూ.28 కూడా తీసుకురాలేదు. సొంత నియోజకవర్గంలోనే సీఎంపై ప్రజలు తిరగబడుతున్నారు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### ప్రభుత్వాన్ని కూల్చేస్తాం..

'లగచర్లలో దాడి జరిగితే మానుకోటలో ధర్నా ఎందుకని పోలీసులు అంటున్నారు. ఎక్కడ గిరిజన, ఎస్సీ, బీసీ, బడుగు రైతులు ఉంటారో అక్కడ ధర్నా చేస్తాం. ఈ సీఎం అదానీ కోసం పని చేస్తున్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఏడాది పూర్తవుతోంది. వాటిని అమలు చేశారా.?. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే



ఉరికించి, ఉరికించి కొట్టేవారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారు. రైతుల పవర్ అంటే అలా ఉంటుంది. రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెబుతున్నా. రేవంత్ రెడ్డి వచ్చాక రైతుబంధు ఎగ్గొంట్టిండు. ఫించన్ పెంచలేదు. బోనస్ బోగస్ అయ్యింది. ఆడబిడ్డలకు మహాలక్ష్మి స్కీం వచ్చిందా? మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారు' అని కేటీఆర్ మండిపడ్డారు.

### వారిపై కేసులుండవా?

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడతామా? మేము కేసీఆర్ తయారు చేసిన దళం. భయపడే ప్రసక్తే లేదని కేటీఆర్ అన్నారు. 'లగచర్లలో 30 మంది రైతులను జైల్లో పెడితే మా బంజారా ఆడబిడ్డలు భయపడలేదు. ఎన్‌హెచ్ఆర్‌సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళ కమిషన్ సభ్యులకు వాళ్ల బాధలు చెబుతుంటే కమిషన్ సభ్యుల కళ్లలో నీళ్లు వచ్చాయి. లగచర్లలో జరిగినట్లే రాష్ట్రంలో ఎక్కడైనా జరగవచ్చు. ఒక దగ్గర అన్యాయం జరిగితే రాష్ట్రమంతా కదం తొక్కాలి. తెలంగాణలో ఏ గిరిజన బిడ్డ కు అన్యాయైన రాష్ట్రమంతా గిరిజన బిడ్డలు కదం తొక్కాలని కోరుతున్నా. మానుకోట మహాధర్నా మొదటి అడుగు మాత్రమే. మన లగచర్ల గిరిజన మహిళలకు న్యాయం జరిగేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల మద్దతు కూడగడుతాం. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు... బంజారా రాష్ట్ర సమితి కూడా. మీకు ఎప్పుడు కష్టమొచ్చినా మేము అండగా ఉంటాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, కవిత తదితరులు పాల్గొన్నారు.



## పత్తి మిల్లులో
# అగ్నిప్రమాదం

- 15 క్వింటాళ్ల పత్తి దగ్ధం
- తప్పిన భారీ ప్రమాదం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఓ పత్తి మిల్లులో అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారులోని బాబా తాజుద్దిన్ సైలానీ కాటన్ ఇండస్ట్రీస్ కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ మిల్లులులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన సుమారు 5 వేల క్వింటాళ్ల పత్తి నిల్వ ఉంది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో నిల్వ చేసిన పత్తి కుప్పల్లో పొగలు రావడంతో గమనించిన వాచ్‌మెన్ నిర్వాహకులకు సమాచారం అందించాడు. అక్క దున్న కూలీలు, సిబ్బందంతా అప్రమత్తమై కొనుగోలు కేంద్రంలో ఫైర్ సేఫ్టీలో భాగంగా ఏర్పాటు చేసిన నీటి పంపులతో మంటలపై పంపింగ్ చేశారు. సమాచారం దుకున్న జనగామ ఫైర్ సిబ్బంది సైతం హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపులో తెచ్చారు. ఈ ప్రమాదంలో 15 క్వింటాళ్ల వరకు పత్తి కాలిపోయిందని నిర్వహకులు తెలిపారు. సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



2 లో

## డిసెంబర్‌లో
# రైతు భరోసా

General News




# డిసెంబర్‌లో రైతు భరోసా

**– జనవరి నుంచి పింఛన్ల పెంపు**

**– కసరత్తు చేస్తున్న సర్కార్**


**మన చౌరాస్తా, హైదరాబాద్ ప్రతినిధి :** తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి సర్కార్.. కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పలు కీలక హామీలను అమలు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే.. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకం, రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిధి పెంపు లాంటి కీలక పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసాతో పాటు ఆసరా పింఛను పథకాలపై కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే.. గత ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు రూ.2 వేలు, దివ్యాంగులకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందిచగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. 2 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలకు, రూ.4 వేలుగా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నప్పటికీ.. ఇంకా పింఛన్ల పెంపు లేకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి నెలకొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కూడా ప్రజలు ఇదే విషయంపై అసంతృప్తి వెల్లగక్కుతున్నట్టు సర్కార్ దృష్టికి వచ్చింది. మరోవైపు.. త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు కూడా ఉండటంతో.. ప్రజల్లోని అసంతృప్తి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం కూడా ఉండటంతో.. ఆసరా పింఛను పథకం అమలుపై కీలక నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థ ఎన్నికలలోపే ఈ పెన్షన్ పెంపు పథకాన్ని అమలు చేసి.. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తీసేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతు భరోసాతో పాటు ఆసరా పింఛన్ పథకం అమలుపై ప్రభుత్వ కసరత్తు చేస్తోంది.

కాగా.. డిసెంబర్ 09 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో.. ఈ సమావేశాల్లో రైతు భరోసా పథకంపై ప్రత్యేకంగా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయగా.. అన్ని జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించింది. ఉపసంఘం ఇచ్చే నివేధికపై అసెంబ్లీలో చర్చించి, అన్ని పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకుని.. రైతు భరోసాపై తుది నిర్ణయం ప్రకటించనున్నారు. ఈ క్రమంలోనే.. అసెంబ్లీ సమావేశాల్లోనే ఆసరా పెన్షన్ పథకం అమలుపై కూడా ప్రకటన చేయనున్నట్టు సమాచారం. దీంతో.. అసెంబ్లీ సమావేశాల తర్వాత కొత్త ఏడాది నుంచి పెంచిన డబ్బులతో పెన్షన్ లబ్దిదారుల అకౌంట్లలో జమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సంకల్ప దీక్ష విజయవంతం చేయాలి



చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టిన ప్రజా సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని ఆకునూరు గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దీక్షను విజయవంతం చేయాలని అన్ని పార్టీల ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు లభిస్తుందని పేర్కొంటూ కాంగ్రెస్, బిజెపి, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రెవిన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని ప్రతి ఒక్కరూ సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందె అశోక్, వెలుగల రఘువీర్, ఆకుల రాజు, జంబుల వెంకటరెడ్డి, మండపల్లి సమ్మయ్య, రణం శ్రీకాంత్, సుర సంపత్, మెంటే ఉపేందర్, సుంకరి వీరయ్య, చిగుళ్ల బాలరాజు, కడుదూరు వీరయ్య, గాజుల సతీష్, గూడ లింగం, పెద్దముత్తుని చంద్రం, బోయిని రాజు, కడారి నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వీరన్నపేట గ్రామంలో ఈనెల 30న చేపట్టిన ప్రజా సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మడలేశ్వర స్వామిని దర్శించుకున్న కొమ్మూరి

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణంలో పెద్ద చెరువు కట్ట వద్ద వెలసిన మడలేశ్వర స్వామిని జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జరగగా అందులో భాగమైన కళ్యాణ మహోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన కొమ్మూరి ప్రతాపరెడ్డికి నిర్వాహకులు స్వాగతం పలుకగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద విత్తరణ జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తుమ్మలపల్లి లీల సంజీవులు, ఆడెపు నరేందర్, మంచాల చిరంజీవులు, దాసరి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రైతుల క్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సూపర్ బచ్చన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, పడమటి కేశ్వాపూర్, ఆలింపూర్, బచ్చన్నపేట పొచ్చన్నపేట చెరువులకు మళ్లించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పరామర్శించిన బలరాం జాదవ్

బోథ్, మన చౌరాస్తా : మండలం గుట్టపక్కతండా గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సక్కర్వాల్ సరిత ఇటీవల చనిపోయారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

Local News



## ప్రజావాణి దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్‌రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో ఉన్న మిగిలిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలపై 42 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారంలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డిఆర్‌డిఓ వసంత, డిఈఓ రాము, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, డిబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డిఎఓ రామారావు నాయక్, డీపీఓ స్వరూప, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## 'వైష్ణవి'పై చర్యలు తీసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** అనుమతులు లేని పాఠశాలల పేరుతో ఐడీ కార్డ్స్ కొట్టించి సమాజంలో మోసాలకు పాల్పడుతున్న వైష్ణవి హై స్కూల్ ని మూసి వేయించాలని ఎన్ఎస్‌యూఐ జనగామ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభి గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొన్ని సంవత్సరాలుగా జనగామలోని ప్రజలు అనుమతులు లేని పాఠశాలలకు లక్షల్లో ఫీజులు కడుతూ మోసపోతున్నారన్నారు. పట్టణంలోని వైష్ణవి హై స్కూల్ ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఒక దగ్గర నుంచి ఇంకొక దగ్గరకి మార్చడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా వైష్ణవి పాఠశాల పేరు మీద అనుమతి తీసుకుని శ్రీ చైతన్య హైస్కూల్ ని నడుపుతూ ప్రజలని మోసం చేస్తున్నారని వివరించారు. ఆ పాఠశాలకు బిల్డింగ్ షిఫ్టింగ్ పెర్మిషన్ లేదు ఫైర్ సేఫ్టీ లేదు.. ఇక రాదు.. ఇవ్వమని ఫైర్ డిపార్ట్మెంట్ అధికారాలు కూడా బద్దలు కొట్టినట్లు తెల్చిచెప్పారని తెలిపారు. ఈ పాఠశాలపై గతంలో కూడా చాలా సార్లు ఫిర్యాదు చేశామని ఆయన వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేకుండా నడిస్తున్న వైష్ణవి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని అభిగౌడ్ డిమాండ్ చేశారు.






## ఆలిండియా ఇంటర్ వర్సటీ బాక్సింగ్‌కు రుద్ర

**జనగామ, మన చౌరాస్తా :** ఆలిండియా ఇంటర్ యునివర్సటీ బాక్సింగ్ పోటీలకు జనగామకు చెందిన అబ్బాస్ టైక్వాండో అండ్ బాక్సింగ్ అకాడమీ స్టూడెంట్ బానోతు రుద్ర ఎంపికైనట్టు కోచ్ అబ్బాస్ తెలిపారు. సోమవారం వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లో నిర్వహించిన ఆలిండియా యూనివర్సిటీ బాక్సింగ్ ఛాంపియన్షిప్ సెలక్షన్స్ లో అండర్ 63 కేజీల విభాగంలో రుద్ర పాల్గొని ప్రతిభ చాటినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బాక్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రుద్ర సెలెక్ట్ అయినందుకు గర్వంగా ఉందన్నారు. ఆమె ఇప్పటి వరకు చాలా మెడల్స్ సాధించిందని, ఈసారి ఆలిండియా యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రుద్రను జనగామ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, కోచ్ అబ్బాస్ మాట్లాడుతూ రుద్ర సెలెక్ట్ కావడం చాలా ఆనందంగా ఉందని, వచ్చేనెల 18 నుంచి 24 వరకు పంజాబ్‌లో జరగబోయే పోటీలో పాల్గొననున్నట్టు తెలిపారు.



## ధర్మకంచలో ఉచిత వైద్య శిబిరం

**జనగామ, మన చౌరాస్తా :** మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా జనగామ పట్టణంలోని ధర్మకంచ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో మై హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 80 మంది రక్తదానం చేశారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత నాగచారి, జనగామ పట్టణ అధ్యక్షులు చెంచార బుచ్చిరెడ్డి, 16 వార్డు కౌన్సిలర్ గాదెపాక రామచందర్ ,30 కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్ల నర్సింగరావు , జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గంగం నరసింహారెడ్డి, డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజమౌళి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికే ఇందిరా కృష్ణస్వామి, వివిధ మండలాల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, బాల్ రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ జమాల్ షరీఫ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జాఫర్ , సోషల్ మీడియా జనగామ జిల్లా కన్వీనర్ దాసరి క్రాంతి, వార్డు అధ్యక్షుడు మిద్దెపాక స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

---

## సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

### – కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో బెల్ట్ షాపులు పూర్తిగా తొలగిస్తామని ప్రకటించిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిబెట్టుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. జనగామ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులు తొలగించాలని ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని సమాజంలో పెరిగిపోతున్న నేర ప్రవృత్తిని అరికట్టాలని పోరాటం చేయడం అభినందించారు. ఈ నెల 30న జనగామ జిల్లా కేంద్రంలో గాయత్రి గార్డెన్స్ లో జరిగే కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్ళు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసంగింగీస్తూ మద్యం వలన లక్షలాది మంది ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోసం కాకుండా ప్రజల ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో బతికేలా చూడాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి కార్యదర్శులు, బాల్నె వెంకట మల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు చట్ల ప్రభాకర్, కనకటి రాజయ్య, కమిటీ సభ్యులు పరిధిల భాస్కర్ , జొన్న గొని శ్రీనివాస్, బసవగాని మహేందర్, బండపల్లి శంకరయ్య మార్క ఉపేందర్, బైరగోని వెంకటయ్య, బుసిగంపల సమ్మయ్య పాల్గొన్నారు.




# పోలవరంలో లయ

**మన చౌరాస్తా, సినిమా :** వేణు నటించిన స్వయంవరం సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది లయ. మొదటి సినిమాతోనే తన అందం, అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించిన లయ తన కెరీర్ లో ఎక్కువగా హోమ్లీ పాత్రలోనే కనిపించింది. అందుకే ఈ ముద్దుగుమ్మకు ఫ్యామిలీ ఆడియన్స్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం భాషల్లో దాదాపు 40కు పైగా సినిమాల్లో నటించింది లయ. అయితే సినిమా కెరీర్ పీక్స్ లో ఉండగానే వివాహం చేసుకుని సినిమా ఇండస్ట్రీకి దూరమైంది. 2006లో అమెరికాకు చెందిన డాక్టర్ శ్రీ గణేశన్ ను వివాహం చేసుకున్న లయ ఆ తర్వాత అక్కడే సెటిల్ అయ్యింది. ఈ దంపతులకు ఒక పాప, బాబు ఉన్నారు. సెకెండ్ ఇన్నింగ్స్ లో భాగంగా ప్రస్తుతం నితిన్ హీరోగా నటిస్తోన్న రాబిన్ హుడ్ సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది లయ. అలాగే బిగ్ బాస్ ఫేమ్ నటుడు శివాజీతో కలిసి మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోనుంది. ప్రస్తుతం సినిమాలు, టీవీ షోలతో బిజీగా ఉంటోన్న లయ తాజాగా పోలవరం డ్యామ్ ను సందర్శించింది. తన స్నేహతురాలితో కలిసి అక్కడకు వెళ్లిన ఆమె సరదాగా ఫొటోలు దిగింది. ఈ ఫొటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి.



# ఘనంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్ పర్సన్ గా లావుడ్య మంజుల భాస్కర్ నాయక్, వైస్ చైర్మన్ గా అనుముల మల్లారెడ్డి, డైరెక్టర్లుగా నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం పాలకుర్తి లోని కమిటీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, పీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తుందని ,vరాష్ట్ర అభివృద్ధి దిష గా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు దూసుకుపోతున్నారని రామచంద్రనాయక్ అన్నారు. గిరిజన మహిళలకు చైర్మన్‌గా అవకాశం కల్పించడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఇద్దరు మహిళలు పాలకుర్తి నియోజకవర్గాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్షులు గిరగాని కుమార్, కార్యదర్శి బైరు భార్గవ్, దేవరుప్పుల అధ్యక్షుడు నల్లా శ్రీరామ్, కొడకండ్ల అధ్యక్షులు సురేష్ నాయక్, తొర్రూర్ మార్కెట్ చెర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి, కొడకండ్ల మార్కెట్ మాజీ చెర్మన్ ఎర్రబెల్లి రాఘవ రావు, పాలకుర్తి ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చెర్మన్ అద్దురి రవీందర్ రావు పాల్గొన్నారు.






## డ్యాన్స్ చేసిన ఎమ్మెల్యే

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సోమవారం పాలకుర్తి చౌరస్తాలో గిరిజన మహిళలతో కలిసి సందడి చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలతో గిరిజన ఆట పాటలతో నృత్యం చేశారు.



## కిటకిటలాడిన సోమన్న ఆలయం

పాలకుర్తిలోని సోమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఉదయం నుంచి రద్దీనెలకొంది. స్వామివారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టగా అధికారులు సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

*- పాలకుర్తి, మన చౌరాస్తా*



